ఏలూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

మాజీ మంత్రి ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామని, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని చెప్పారు. అమృత్ పథకం, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు, నాడు–నేడు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ అమృత్ 2.0 పథకంలో ఏలూరు నగరం, 7 విలీన గ్రామాల్లోని ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.362 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో విలీన గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సరఫరా, ట్యాంకులు నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటు, స్టోరేజ్ ట్యాంకులు నిర్మాణం చేసేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టేందుకు వెంటనే డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలు భవిష్యత్‌లో తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

నాడు –నేడులో స్కూల్స్ అభివృద్ధి

ఏలూరు నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే నాని స్పష్టం చేశారు. నాడు–నేడు 2ఏలో పాఠశాలల అభివృద్ధి పనుల్లో పురోగతిపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఏలూరు నగరంలోని 16 పాఠశాలలు, రూరల్, విలీన గ్రామాల్లోని 49 స్కూల్స్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలనీ, నిరంతర పర్యవేక్షణతో నాణ్యమైన రీతిలో స్కూల్స్ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నాని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఏలూరు నియోజకవర్గంలో మూడు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై మరింత శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతోపాటు రోడ్ల నిర్మాణం, విద్యుదీకరణ, డ్రెయినేజీలు నిర్మాణం, సురక్షిత తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాలనీల్లో జరిగే అభివృద్ధి పనులపై అధికారులు నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు ఉండాలని ఎమ్మెల్యే నాని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్ సుందర్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ప్రజారోగ్య విభాగం ఎస్ఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తోన్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టూటౌన్ టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలిగా అమీనా అన్సారీ

ఏలూరు టౌన్ : ఏలూరు డ్వాక్రా సంఘాల పట్టణ సమాఖ్య టూటౌన్ అధ్యక్షురాలుగా అమీనా అన్సారీ నియమితులయ్యారు. గతంలో ఏలూరు పట్టణ సమాఖ్య ఒక్కటిగా ఉండగా, 7 విలీన గ్రామాలతో ఏలూరు వన్‌టౌన్, టూటౌన్‌గా విభజించారు. ఈ నేపథ్యంలో ఏలూరు టూటౌన్ టీఎల్‌ఎఫ్ అధ్యక్షులుగా అధికారికంగా నియామక పత్రాన్ని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చేతులమీదుగా అందుకున్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన టూటౌన్ టీఎల్‌ఎఫ్ కమిటీ ఎమ్మెల్యే ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలూరు నగరంలో మిగిలిన 33 గ్రూపులకు ఆసరా సొమ్ము విడుదల అయ్యిందనీ, మరో 8 గ్రూపులకు సాంకేతిక కారణాలతో సొమ్ము మంజూరు కాలేదని ఆళ్ల నాని దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాల బలోపేతానికి, డ్వాక్రా మహిళల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామనీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మహిళాభ్యున్నతికి పాటుపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ఇమ్మానుయేల్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆళ్ల నాని చేతుల మీదుగా పత్రాన్ని అందుకుంటున్న ఏలూరు టూటౌన్ టీఎల్‌ఎఫ్ అన్సారీ

క్లుప్తంగా

మొహర్రం పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



అన్నదాన కార్యక్రమానికి ఆహ్వానం పలుకుతున్న ముస్లిం పెద్దలు

ఏలూరు టౌన్ : ముస్లిం సోదరులంతా మొహర్రం పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలనీ, ప్రజలందరికీ అల్లాహ్ దయ ఉండేలా ప్రత్యేక ప్రార్థనలు చేయాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని కోరారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏలూరు 12వ డివిజన్‌కు చెందిన గొలుసు పంజా పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారంతా శనివారం మొహర్రం పండుగ సందర్భంగా చేపట్టే అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆళ్ళనాని హాజరుకావాలని కోరుతూ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఏలూరు కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ముస్లిం పెద్దలు ఉన్నారు.

జీతాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

ఏలూరు (టూటౌన్): శ్రీసత్యసాయి తాగునీటి ప్రాజెక్టు లో పనిచేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ మూడు నెలల జీతాలు చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరు సీపీఐ నాయకులు ఓ ప్రకటన విడుదల చేశారు. గత కాంట్రాక్టర్ పెట్టిన బకాయిలతో పాటు ప్రస్తుతత కాంట్రాక్టర్ బాకీ పెట్టిన మూడు నెలల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సంస్కరణలను అమలు చేయవద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్తు సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేయొద్దని ఏలూరు నగర అభివృద్ధి కమిటీ, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఏలూరు కార్యదర్శి పి. కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన రావు, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్‌లు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయడం వల్ల విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నాన్నాయన్నారు. అనంతరం విద్యుత్తు శాఖ జిల్లా అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కట్టా సత్యనారాయణ, దండు బోయిన చంద్రశేఖర్, ఉప్పు మురళీకృష్ణ పాల్గొన్నారు

తమ్మిలేరు వరదలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు టౌన్: ఏలూరు పరిసర ప్రాంతాలతో పాటు తమ్మిలేరు ఎగువ పరీవాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళనాని సూచించారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఏలూరు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలతో తమ్మిలేరుకు వరద వచ్చే అవకాశం ఉందని, ఏలూరు నియోజకవర్గం పరిధిలో ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. ముందుగానే వరద ముంపు లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఈ సమీక్షలో నీరుపారుదల శాఖ ఈఈ దేవప్రకాష్, డీఈ అర్జున్, ఏపీ ఎన్‌జీవో అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హెల్ప్‌లైన్‌కు వందనం

ఒక్కరోజులోనే సర్టిఫికెట్ ఇచ్చారు



నా అమ్మాయికి క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలి. అధికారులను అడిగితే పత్రాలు అన్నీ పట్టుకుని దరఖాస్తు చేయాలన్నారు. అయితే నాకు అవేమి అర్థంకాకపోవడంతో వలంటీర్‌ను ఆశ్రయించాను. దీంతో నాతో పత్రాలకు అప్లయ్ చేయించి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్ ఇచ్చారు. వలంటీర్ వల్లనే నా కుటుంబ సభ్యులకు ఇంటి స్థలం వచ్చింది. ఫించన్ వస్తుందంటే అది వలంటీర్ పుణ్యమే. ముఖ్యమంత్రి చేపట్టిన పథకాలు నా లాంటి పేదలకు సక్రమంగా అందుతున్నాయంటే దానికి ప్రధాన కారణం వలంటీర్ వ్యవస్థే.

– సీహెచ్ దమయంతి, చాటపర్రు

అర్హులకు అండగా..



వలంటీర్లు లేకపోతే పథకాలు అందేవి కావు. గతంలో నచ్చిన వారికి పథకాలు ఇచ్చేవారు. వలంటీర్ వ్యవస్థ వల్లే పేదలకు అన్నీ చేరుతున్నాయి. రెండురోజుల క్రితం వలంటీర్ నా ఇంటికి వచ్చి, దరఖాస్తు పూర్తి చేశాడు. మరుసటి రోజు జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు కులం, నివాసం సర్టిఫికెట్ అందించారు. ప్రభుత్వ సేవలు ఇంత వేగంగా, ఇంటికే చేరుతాయని నేను ఎన్నడూ అనుకోలేదు. గతంలో సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాల్సి వచ్చేది.

– పి దుర్గాప్రసన్న, చాటపర్రు

ఆక్రమణలతోనే అసలు సమస్య

- 1200 ఎకరాల్లో నీట మునిగిన పంటచేలు
- మురుగు ప్రవాహం అడ్డుకుంటున్న చేపల చెరువు గట్లు

ఏలూరు రూరల్: మండలంలో సుమారు 1200 ఎకరాల్లో పంటచేలు నీట మునిగాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పంటకాలువలు, మురుగు డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. జాలిపూడి, పోణంగి, మాదేపల్లి, చాటపర్రు, మల్కాపురం పరిసర ప్రాంతాల చేలల్లో మురుగునీరు కిందకు పారకుండా చేపల చెరువుల గట్లు అడ్డుకుంటున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. మండల వ్యవసాయ అధికారి జీవనసంధ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ వై సుజాత, ఉపాధిహామీ పథకం ఏపీఓ కిషోర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి కూలీలతో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత చేపట్టారు.

ఆక్రమణలతో రైతుల అవస్థలు

గ్రామాల్లో పంటకాలువ గట్లు, మురుగు డ్రెయిన్లు ఆక్రమణ ల వల్ల చేలు నీట మునిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

- తంగెళ్లమూడి ఆర్టీసీ కాలనీ దిగువన ఉన్న సుమారు 100 ఎకరాల్లో పంటచేలు నీట మునిగాయి. స్థానిక వ్యాసగాని డ్రెయిన్‌ను వ్యాపారస్తులు ఆక్రమించడం వల్లనే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు.
- పోణంగి గ్రామంలో బుచ్చిరాజు, రాపాకవారి చెరువుల మధ్య గూండా ప్రవహించే పుంతకాలువ పూడుకుపోయింది. దీనివల్ల ఓ రైతు 12 ఎకరాల్లో పోసిన నారు నీట మునిగింది. వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించి సబ్సిడీపై విత్తనాలు అందిస్తామని రైతుకు చెప్పారు. నావల్ల కాదు. నేను మరోసారి నారు పోయలేనంటూ రైతు చేతులెత్తేశాడు. పుంత ఆక్రమణ, చెరువు యజమానులపై మత్స్యశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు నేటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- జాలిపూడి శివారున చేపల చెరువుల గట్లు కారణంగా కొండేపుంత కోడు కుచించుకుపోయింది. దీంతో చేలల్లో మురుగునీరు వేగంగా కిందకు పారడం లేదని రైతులు అంటున్నారు. అధికారులు పరిశీలించి ఉపాధి కూలీలతో కొన్ని చోట్ల గుర్రపుడెక్క తొలగించారు.
- పాండురంగా థియేటర్ నుంచి వెంకటాపురం మీదుగా పారే జాలిపూడి డ్రెయిన్ పూడిక అధికారులు ప్రొక్లెయిన్‌తో తొలగించడంతో చేలల్లో మురుగు కిందకు పారుతోంది.
- మల్కాపురం సచివాలయ సిబ్బంది ఉపాధి కూలీలతో పాలిమేర కోడు కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలిగించారు. ఫలితంగా చేలల్లో మురుగు కిందకు వేగంగా కిందకు పారుతోంది. చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు కూలీలతో పంటకాలువ పూడిక తొలగించారు.



వ్యాసగాని కోడు ఆక్రమణకు గురికావడంతో తంగెళ్లమూడి ఆర్టీసీ కాలనీలో నీటమునిగిన పంటచేలు



ప్రొక్లెయిన్‌తో జాలిపూడి డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న దృశ్యం



జాలిపూడిలో గుర్రపుడెక్క తొలగిస్తున్న ఉపాధి కూలీలు, అధికారులు



మల్కాపురంలో గుర్రపుడెక్క తొలగించడంతో కిందకు పారుతున్న పాలిమేర కోడు

హౌసింగ్ ఉద్యోగుల సమావేశం



సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల వివరిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ హౌట్‌సోర్సింగ్ ఉద్యోగులు, డీఈఓలు సమావేశం నిర్వహించార. ఈ సమావేశానికి జిల్లా హౌసింగ్ మేనేజర్ ఎండీ షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను సైతం రెగ్యులర్ చేయాలని కోరారు. హౌసింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు విట్టల కుమార్, హౌసింగ్ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఇండియన్ ప్రెసిడెంట్ పి.సాయికుమార్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ భాస్కర్ పాల్గొన్నారు.

బ్లాక్ టిక్కెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు వన్ టౌన్ పరిధిలో తాజాగా రిలీజ్ అయిన ఓ సినిమాకు సంబంధించి బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఏలూరు వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు వన్ టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్సై భాష ఆధ్వర్యంలో హెచ్సీ రాధాకృష్ణ. సిబ్బందితో కలిసి సినిమా థియేటర్ వద్ద బ్లాక్ టికెట్లు విక్రయించకుండా తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు సత్యనారాయణ థియేటర్ వద్ద బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్న తమ్మిశెట్టి చిరంజీవి వద్ద ఆరు సినిమా టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. విజయలక్ష్మి థియేటర్ వద్ద దగులూరి రాజేష్ వద్ద 16 బ్లాక్ టికెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశారు.

అక్రమ మద్యం కలిగిన వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు వన్ టౌన్ పరిధిలో ఒక వ్యక్తి అక్రమంగా మద్యం కలిగి ఉండడంతో అతన్ని అరెస్ట్ చేశారు. వన్ టౌన్ సీఐ ఎన్. రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్సై భాష తనిఖీలు చేపట్టారు. యార్లగడ్డ మనోజ్ కుమార్ అనే వ్యక్తి పది మద్యం బాటిళ్లు కలిగి ఉండడంతో తనపై కేసు నమోదు చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

తృటిలో తప్పిన పడవ ప్రమాదం

ఏలూరు రూరల్: మండలంలోని కోమటిలంక గ్రామం వద్ద శుక్రవారం తృటిలో పడవ ప్రమాదం తప్పింది. సర్పంచ్ తెనాలి యోహాన్ చెప్పిన వివరాల ప్రకారం సాయంత్రం 5 గంటల సమయంలో పలువురు మహిళలు, పురుషులతో పాటు పిల్లలు ఉధృతంగా ప్రవహిస్తున్న నాగరాజు కోడె మీదుగా రేకు పడవలో పయనిస్తున్నారు. ఇదే సమయంలో పడవ నెడుతున్న వెదురు గెడ విరిగిపోవడంతో ఒక్కసారిగా పడవ కుదుపుకు గురైంది. కంగారు పడ్డ పలువురు పురుషులు పడవ నుంచి కొల్లేరులోనికి దూకేశారు. కొందరు యువకులు, మహిళలు పడవ మునగకుండా అదుపు చేశారు. దీంతో ప్రయాణికులతో పడవ కొద్ది దూరం దిగువకు చేరింది. దీన్ని గుర్తించిన స్థానికులు అప్రమత్తమై వెంటనే పడవను పట్టుకుని ఒడ్డుకు చేర్చారు. ప్రయాణికులు అందరూ క్షేమంగా ఉన్నారని సర్పంచ్ వెల్లడించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కొల్లేరులోనికి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతోంది. దీంతో కోమటిలంక వద్ద నాగరాజు కోడు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎన్నోఏళ్లుగా వర్షాకాలంలో ఈ కోడు మీదగా కోమటిలంక ప్రజలు రేకు పడవలో రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	120	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	40	కంద	40
పచ్చిమిర్చి	60	బీట్‌రూట్	40
కాకర కాయలు	44	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	180-270
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	16	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	22-32	బఠాణీ	--
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	108
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	23

ఎంఐఎస్ కోఆర్డినేటర్ల పాత్ర కీలకం



ఎంఐఎస్ కోఆర్డినేటర్ల వర్క్‌షాప్‌లో పాల్గొన్న డీఈఓ శ్యామ్ సుందర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఆయా పథకాలను అర్హులకు అందేలా చేయడంలో పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు. ఏలూరు జిల్లాలోని మండల డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో ఏలూరులోని ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్‌లో ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలపై శుక్రవారం ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ నాడు– నేడు, మిషన్ జీఈఆర్, జగనన్న విద్యాకానుక వంటి ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలను మండల స్థాయిలో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని, మండలాలకు, జిల్లాకు మధ్య వారధిలాగా పనిచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ తిరుమల రావు గారు, సీఎంఓ జే. రవీంద్ర, ఏఎల్ఎస్‌సీఓ జీ. రాధాకృష్ణ పాల్గొన్నారు.

దోమతోనే వ్యాధుల వ్యాప్తి

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి గణపవరం మండలం చిలకంపాడు గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్రైడే– డ్రైడేగా పాటించాలని, దోమల వ్యాప్తి, నివారణ, దోమల నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటనారాయణ, గ్రామ కార్యదర్శి ఆర్.స్రవంతి పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

పెదపాడు : కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు శుక్రవారం తెలిపారు. పెదపాడు గ్రామం వైపు వస్తున్న వాహనంతో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి అడ్డుకున్నట్లు ఎస్సై తెలిపారు. కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వాహనం సీజ్ చేసినట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

30న కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు

పెదపాడు: రైతాంగ సమస్యలపై ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరులో కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు ప్రచార పోస్టర్లు కరపత్రాలను శుక్రవారం ఆయన విడుదల చేశారు.

శంకుస్థాపనలు వాయిదా

దెందులూరు: దెందులూరు పెదదళితవాడలో శనివారం జరగాల్సిన శంకుస్థాపనలు వాయిదా వేసినట్లు వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు తెలిపారు. అధికారులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు శంకుస్థాపనల వాయిదా విషయాలను గమనించాలని ఆయన కోరారు.

నిండు కుండలా జల్లేరు జలాశయం

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం 215.55 మీటర్లకు చేరుకున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కొండల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతున్నందున జలాశయం నుంచి శుక్రవారం రాత్రి సుమారు 150 క్యూసెక్‌ల నీటిని బయటకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.